అయోమయోగాంధ్ర


ఆసనాలు వేస్తున్న ఎంఈఓ, సచివాలయ సిబ్బంది

- తీవ్రస్థాయిలో ఉద్యోగులపై పని ఒత్తిడి
- యోగాంధ్ర సర్వే లక్ష్యాలు
- టెలీ కాన్ఫరెన్సులతో తిప్పలు
- సాధ్యం కాని ఆసనాలతో పోటీ ఎలా అంటున్న ప్రజలు

యోగాంధ్ర పేరిట ప్రభుత్వం చేస్తున్న హంగామా అధికారులు, ఉద్యోగులను అయోమయానికి, తీవ్ర అవస్థలకు గురిచేస్తోంది. గ్రామ సెక్రటరీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు, యోగాంధ్ర మాస్టర్ ట్రైనీలు ఇలా అందరిపైనా తీవ్ర పనిభారం, ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్లు, యోగా ప్రోటోకాల్ ఆసనాల శిక్షణను అధికారులు నయానో భయానో పూర్తి చేశారు. ఇందుకోసం ఏ ఒక్కర్నీ వదల్లేదు. కొన్ని రోజులుగా మిగతా విషయాలు పక్కన పెట్టి కేవలం యోగా మంత్రం జపిస్తున్నారు. దీంతో అధికారులు తీవ్రంగా నలిగిపోతున్నారు. యోగాంధ్ర యాప్ రిజిస్ట్రేషన్లు నుంచి గ్రామ, మండల స్థాయి పోటీల నిర్వాహణ వరకు ఎంపీడీఓ, తహశీల్దార్ స్థాయి అధికారులకు లక్ష్యాలుగా నిర్ణయించారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఈ లక్ష్యాలను ఎలా చేరుకోగలమంటూ అధికారులు మదనపడిపోతున్నారు. -కార్వేటినగరం

రాష్ట్రంలో యోగాంధ్ర కార్యక్రమం అమలవుతున్న తీరు ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుంది. నెల రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ప్రజలను భాగస్వాములు చేయాలని సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. జిల్లాలో పురపాలక సంఘాలు, నగర పంచాయతీలతోపాటు సచివాలయ పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇవేం పోటీలు

జిల్లా స్థాయిలో యోగా పోటీలకు సంబంధించి 10 నుంచి 18 సంవత్సరాలు, 19 నుంచి 35 సంవత్సరాలు, 35 ఏళ్లు పైబడి అంటూ మూడు విభాగాల్లో పీఓటీలు నిర్వహిస్తున్నారు. వాస్తవానికి 50 ఏళ్లు పైబడిన కేటగిరీ ఇవ్వకపోవడంతో యోగాలో అనుభవం, ఆసక్తి ఉన్న ఆ వయస్సున్న వారితో పోటీ పడే పరిస్థితి ఏర్పడింది. వారంతా పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి కనబర్చడం లేదు. నిరంతరం సాధన చేసేవారు యోగా శిక్షణ కేంద్రాల్లో శిక్షణ పొందేవారు మాత్రమే వేయగల ఆసనాలను మాత్రమే పోటీల జాబితాలో పొందపర్చడంతో ఆ జాబితాను చూసిన వారంతా విస్మయం చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్న వారిని సైతం పోటీల్లో అభ్యర్థులుగా చేర్చడంతో.. క్లిష్టతరమైన ఆసనాలు వేయలేమని తమ పేర్లను తొలగించాలని వారు కోరుతున్నారు. కానీ పోటీలో ఎక్కువ మంది పాల్గొన్నట్టు చూపించేందుకు అధికారులు తంటాలు పడుతున్నారు. చిన్నపిల్లలకు ఆకర్ణ ధనురాసనం, బకాసనం, 19నుంచి 35 సంవత్సరాల విభాగంలో మత్స్యేంద్రాసనం, జిల్లా స్థాయిలో విభక్త పశ్చిమోత్తానసనం తదితర ఆసనాలు వేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో పూర్ణమత్స్యేంద్రాసనం, ఓంకారాసనం, కర్ణపీడనాసనం ఇచ్చారు. సచివాలయ ఉద్యోగులతోపాటు యోగా మాస్టర్ ట్రైనీలు, ఎంపీడీఓలు గ్రామాల్లోకి వెళ్లి పోటీల్లో పాల్గొనాల్సిందిగా అందరినీ ప్రాధేయపడాల్సి వస్తోంది. మండల స్థాయి పోటీలను ఏదోలా మమ అనిపించినప్పటికీ జిల్లా స్థాయి పోటీలకు వెళ్లేవారిని పంపించడం కష్టతరమేనని అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

వెబ్‌తోనే సమయం సరి

యోగాంధ్ర కార్యక్రమం కోసం ప్రతి రోజూ కలెక్టర్ నుంచి ఆయుష్ విభాగం అధికారులు, పలు శాఖల జిల్లా స్థాయి అధికారులు గూగుల్‌మీట్, వెబెక్స్ నిర్వహిస్తుండడంతో గంటల కొద్దీ సమయం వృథా అవుతుందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు కింది స్థాయి ఉద్యోగాలను గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడమే లక్ష్యంగా దృష్టి పెట్టాలన్నారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మూడు రోజులపాటు ఎటువంటి శ్రమ లేకుండా చేపట్టామని అధికారులు చెబుతుండడం గమనార్హం. అప్పటి ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. కానీ ఇప్పుడు యోగాంధ్ర కార్యక్రమం కోసం నెల రోజులపాటు నరకయాతన పడుతున్నామని అధికారులు తమ అంతర్గత సంభాషణల్లో తలలు పట్టుకుంటున్నారు. యోగాసనాలు నేలపై వేయకూడదు, మ్యాట్‌లు, లేదా కార్పెట్లు వంటివి ఉండాలి. కానీ యోగాంధ్ర కోసం అధికారుల మాట కాదనలేక కటిక నేలపై కూడా ఆసనాలు చేస్తున్న ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యోగాంధ్ర కార్యాచరణతో చాలా పని ఒత్తిడితో సచివాలయం నుంచి మండల స్థాయి ఉద్యోగులంతా నరకం చూస్తున్నారు. చివరకు రోజూ కార్యాలయంలో రాత్రి 10 గంటల వరకూ కూడా పని చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అధికారులు తీవ్రంగా మదనపడుతున్నారు.

ఆసనాల పోటీలు ఎలా?

యోగాంధ్ర కార్యక్రమానికి మే 21 నుంచి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖ కేంద్రంగా ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించారు. ప్రధాని మోదీ కూడా హాజరవుతుండడంతో ఎలాగైనా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో అధికారులు, ఉద్యోగులకు క్షణం తీరిక లేకుండా పోయింది. యోగాంధ్ర ఎన్‌రోల్‌మెంట్, మాస్టర్ ట్రైనీల రిజిస్ట్రేషన్, యోగా ప్రోటోకాల్ ఆసనాలను పూర్తి చేసినప్పటికీ జిల్లా స్థాయి యోగాసనాల పోటీల నిర్వహణ మాత్రం తమ వల్ల కాదని చేతులెత్తేస్తున్నారు. ఎందుకంటే సాధ్యం కాని, అలవాటు లేని ఆసనాలతో పోటీలు నిర్వహించాలని అధికారులు మార్గదర్శకాలు పేర్కొనడంతో కొత్తగా యోగా నేర్చుకున్న తాము ఈ ఆసనాలను ఎలా వేయగలమంటూ పోటీల్లో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

క్లుప్తంగా

ప్రహరీని పునర్నిర్మించండి


కూలిపోయిన ప్రహరీ

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి కూలిపోయినది. కూలిపోయిన ప్రహరీ గోడను జిల్లా స్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అయితే పాఠశాల పునఃప్రారంభమైనా ఇంతవరకు ప్రహరీ నిర్మాణం చేపట్టలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రహరి గోడ కూలిపోయిన ప్రక్కనే పెద్ద బావి ఉంది. కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు అటువైపు వెళ్తే బావిలో పడిపోతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి కూలీపోయిన ప్రహరీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వారాహి శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు


మోహనమ్మకు సత్కారం

పుత్తూరు: పరమేశ్వరమంగళం గ్రామ సమీపాన నగరి కనంమిట్ట వద్ద వెలసి ఉండు దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో ఆదివారం పంచమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, కాళీవారాహి మాతను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ మోహనమ్మ పుట్టినరోజును పురస్కరించుకొని వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరి, స్కౌట్ విద్యార్థులు శైలజ, యువశ్రీ, జైకుమార్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా కుంభాభిషేకం


ప్రతిష్టాపనకు సిద్ధంగా ఉన్న ధ్వజస్తంభం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామంలో వెలసిన తిరుమలేశ్వరి సమేత శ్రీతిరుమలేశ్వర ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఉదయం 9-10 గంటల సమయంలో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మామిడి రైతుల నిరసన


పుత్తూరులో మామిడి రైతుల నిరసన

పుత్తూరు: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆదివారం పుత్తూరు రూరల్ మండలం కేబీఆర్‌పురం గ్రామంలో మామిడి రైతులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రైతు సంఘం నాయకుడు కేశవులు మాట్లాడుతూ జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు తోతాపురికి రూ.8, ప్రభుత్వం రూ.4 మొత్తం రూ.12 ఇచ్చేటట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించినా ప్రయోజనం శూన్యమని ఆరోపించారు. ఫ్యాక్టరీ వారు రూ.6 మాత్రమే ఇస్తూ రైతులను మోసం చేస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేబీఆర్‌పురం మామిడి రైతుసంఘం నాయకులు రవివర్మ, కేశవులు, ఉపేంద్రవర్మ, ఓబులురాజు, కుప్పమందడి, వెంకటరామయ్య, లోకేష్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా వృద్ధులను రక్షించాలి


అవగాహన కల్పిస్తున్న న్యాయవాది దినకర్

కార్వేటినగరం: వృద్ధుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని న్యాయవాది దినకర్ అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది దినకర్ మాట్లాడుతూ వృద్ధులైన తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వృద్ధుల రక్షణకు ప్రత్యేక విభాగం ఉందని, వృద్ధులు అందులో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం వృద్ధులకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్నదానంతోపాటు పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు.

రాష్ట్ర స్థాయి యోగాకు మాన్యశ్రీ


మాన్యశ్రీతో యోగా సొసైటీ సభ్యులు

నాగలాపురం: పిచ్చాటూరు అరణియార్ యోగా-ధ్యాన సొసైటీకి చెందిన మాన్యశ్రీ యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగా మాస్టర్ థామస్ తెలిపారు. ఆదివారం ఉదయం అరణియార్-యోగా ధ్యాన సొసైటీ కేంద్రంలో మాన్యశ్రీని మాస్టర్, సభ్యులు ఘనంగా సత్కరించారు. యోగా మాస్టర్ మాట్లాడుతూ మాన్యశ్రీ, తండ్రి ఆనంద్, చెల్లెలు యువశ్రీ యోగా కేంద్రంలో సభ్యులుగా ఉంటూ నిత్యం చక్కగా యోగా సాధన చేస్తున్నారన్నారు.

వధూవరులకు ఆశీస్సులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: నాగలాపురంలో ఆదివారం జరిగిన నగరి రూరల్ మండలం వేలావడి గ్రామానికి చెందిన కోఆప్షన్ మెంబర్ దస్తగిరిభాయ్ మనవడు, అల్లావుద్దీన్ కుమారుడు అహ్మద్ నూర్ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. నగరి రూరల్ మండలం కృష్ణాపురం వైఎస్ఆర్ సీపీ నాయకులు సుందరం తండ్రి సుబ్రమణ్యంయాదవ్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం నిర్వహించిన కర్మక్రియల్లో ఆర్కే రోజా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, వైఎస్ఆర్ సీపీ అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తెలిపారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఈఎల్, ఇతర బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 104 నిర్వహణ ఏజెన్సీ మారిందని వారు కూడా ప్రతి నెలా జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలన్నారు. మరమ్మతు అయిన వాహనాలను వెంటనే బాగు చేయించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా గ్రీవెన్స్ కార్యక్రమం ఏజెన్సీలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండలంలోని నచ్చుకూరు గ్రామంలో హఠాత్తుగా మృతి చెందిన విశ్వనాథరెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి పార్థివ దేహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నివాళులర్పించారు. ఆదివారం గ్రామంలో పర్యటించిన ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, పెద్దబ్బరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ బాబు ఉన్నారు.

ప్రమాదకరంగా మలుపులు


మహదేవపురం సమీపంలో ప్రమాదకరమైన మలుపు


పాలసముద్రం బీసీ కాలనీ వద్ద వలుపు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ-చిత్తూరు జాతీయ రహదారిలో ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ముఖ్యంగా పాలసముద్రం బీసీ కాలనీ, మహదేవపురం మార్గంలో ఉన్న పలువులు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. వీటి వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేవు. వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఒకదానికొకటి కనిపించవు. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాల్సి ఉంది.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

గంగాధరనెల్లూరు: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని, ప్రజలకు ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ రైతు మురళి అన్నారు. అవని ప్రకృతి వ్యవసాయ రెండో వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీ దొడ్డిపల్లి గ్రామం వద్ద రాష్ట్ర నలుమూలల నుండి ప్రకృతి వ్యవసాయ రైతులతో భారీ ఏర్పాట్లతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ


భీమ దుర్యోధనుల యుద్ధ సన్నివేశం

కార్వేటినగరం: కొల్లాగుంటలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ, ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. మధ్యాహ్నం భాగవతారిణి భారతి హరికథా కాలక్షేపాన్ని కనులకు కట్టినట్లు ఆలపించారు. మధ్యాహ్నం శ్రీపాండురంగ కళా నాట్యమండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనుని భీమసేనుడు గంగ మడుగు నుండి తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకొంది. కొల్లాగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పట్నం కాంతమ్మ, ఆర్ముగంరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జ్యోతి ఉభయదారులుగా వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

వార్షిక మహాభారత బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి, వేపాకులు చేతబట్టి అమ్మవారి విగ్రహంతో పాటు గోవిందనామాలను స్మరిస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. కార్యక్రమానికి శాంతి, తుల సీరామ్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, కమిటీ మెంబర్లు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. యువత ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాణసంచా వేడుకలు

మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొల్లాగుంట గ్రామానికి చెందిన దొరస్వామిరెడ్డి, ధనమ్మ, ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, జయంతి ఆధ్వర్యంలో బాణసంచా వేడుకలకు ఉభయదారులుగా వ్యవహరించారు.

అలరించిన దుర్యోధన వధ

శ్రీరంగరాజపురం: మండలం కేంద్రంలోని భారతం మిట్ట వద్ద వెలసినశ్రీ ద్రౌపది ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక మహాభారతం ఉత్సవం బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన ఘట్టం అట్టహాసంగా జరింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం హరికథ, ప్రత్యేకంగా భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధన ఘట్టం ప్రదర్శించారు. దుర్యోధనుడిని భీమసేనుడు గంగమడుగు నుంచి బయటికి రప్పించే ఘట్టం చూపులను ఆకట్టుకుంది. దుర్యోధన పాత్ర పలువురిని కంటతడి పెట్టించాయి. భీముడు, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం గతంలో జరిగిన ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతరం ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి, తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త వేణునాయుడు, రాజశేఖర్‌నాయుడు, ఎత్తిరాజులు, సర్పంచ్ హరిత, కుప్పయ్య, నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం గ్రామంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గత 10 రోజులుగా జరుగుతున్న మహాభారత ఉత్సవాలు ఆదివారం దుర్యోధన వధతో ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి భాగవతారిణి హరికథ కాలక్షేపం జరిగింది. అనంతరం మధ్యాహ్నం దుర్యోధన వధ ఘట్టాన్ని కళాకారులు రక్తికట్టించారు. సాయంత్రం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.


దుర్యోధన వధ ఘట్టం


భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం

అట్టహాసంగా ముగిసిన బ్రహ్మోత్సవం

- అశేష భక్తజనం మధ్య చక్రస్నానం
- పుష్కరిణిలో పవిత్ర స్నానాలు

వడమాలపేట(విజయపురం): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. ఉదయం 10.30 గంటల నుంచి 10.45 వరకు ఆలయ పుష్కరిణిలో తీర్థవారి చక్రస్నానం అశేష భక్తజనం గోవిందనామ స్మరణ మధ్య వైభవంగా జరిగింది. ఉదయం 5 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 7.30 గంటలకు చూర్ణోత్సవం, 8 గంటలకు నుంచి 9 వరకు పల్లకి ఉత్సవం వైభవంగా జరిగింది. అనంతరం 9.15 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునితోపాటు శ్రీసుదర్శన చక్రతాళ్వార్‌కు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం వేద పండితులు ఆలయ పుష్కరిణిలో చక్రస్నానం అశేష భక్తజనం మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు.


పుష్కరిణిలో చక్రస్నానం


స్నపన తిరుమంజనం

గోవింద నామస్మరణ

బ్రహ్మోత్సవాల్లో చివరి అంకమైన ధ్వజావరోహణం ఆదివారం రాత్రి 7 గంటలకు అశేష భక్తజనం గోవిందనామ స్మరణ మధ్య వైభవంగా జరిగింది. అనంతరం పూర్ణాహుతి, విశేష నివేదన, అర్చక బహుమానం కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి ఏకాంత సేవతో శ్రీప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవ రాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.